సాక్షి
కర్నూలు
మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



శ్రీశైలంలో సాయి ధరమ్ తేజ్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను ప్రముఖ హీరో సాయిధరమ్ తేజ్ సోమవారం దర్శించుకున్నారు. పలువురు ఆయనతో ఫొటో, సెల్ఫీ దిగేందుకు ఆసక్తిచూపారు.



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవ నిర్వహించింది. ముందుగా అర్చకులు మండపంలో వెయ్యి దీపాలు వెలిగించి పూజలు చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,611.43
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 40.356
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 9,821

న్యూస్‌రీల్

ఉపాధి నిధుల వినియోగంపై ఆడిట్



జిల్లాకు వచ్చిన ఆడిట్ టీమ్ ప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసిన డ్వామా పీడీ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆడిట్ విభాగం బృందం తనిఖీలు చేపట్టింది. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ నేతృత్వంలో సోమవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాల్లో మెటీరియల్, లేబర్ కాపోనెంటు కింద చేపట్టిన నిధుల వినియోగంపై ఈ టీమ్ ఆడిట్ నిర్వహిస్తోంది. కేంద్రం నుంచి వచ్చిన ఆడిట్ బృందాన్ని హోటల్ త్రిగుణలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య, అదనపు పీడీ మాధవీలత, పరిపాలన అధికారి విజయలక్ష్మి, ఫైనాన్స్ మేనేజర్ అదెయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్ఆర్ఈజీఎస్ నామ్స్ ప్రకారం ఉపాధి నిధులు వినియోగించారా లేదా అనే దానిని ఈ టీమ్ పరిశీలిస్తుంది. సోషల్ ఆడిట్, దుర్వినియోగం అయిన నిధుల రికవరీ తదితర వాటిని పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు.

బోదకాల బాధితులకు కిట్ల పంపిణీ



బోదకాలు బాధితురాలికి కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): బోదకాలుతో బాధపడుతున్న ముగ్గురికి మార్బిడిటీ మానిటరింగ్ కిట్(టబ్, మగ్, సబ్బు, ఆయింట్‌మెంట్, టవల్)ను, అవసరమైన మాత్రలను అధికారులు అందజేశారు. సోమవారం స్థానిక జొహరాపురంలోని యూపీహెచ్‌సీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ పి. శాంతికళ మాట్లాడుతూ జిల్లాలో 22 మంది బోధకాలు వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వీరు తరచుగా వ్యాధిసోకిన కాలును టబ్‌లో ఉంచి సబ్బు నీటితో శుభ్రంగా కడిగి టవల్‌తో తుడిచిన తర్వాత ఆయింట్‌మెంట్ పట్టించాలని సూచించారు. ఈ వ్యాధి ఆడ క్యూలెక్స్ దోమకాటుతో వ్యాపిస్తుందని, నివారణ చర్యల్లో భాగంగా దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, యుపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, ఏఎంవో చంద్రశేఖర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూపు-2 మెయిన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): ఈనెల 23వ తేదీన గ్రూపు-2 మెయిన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఏపీపీఎస్సీ జిల్లా కోఆర్డినేటర్, జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గ్రూపు-2 పరీక్షలపై జిల్లా అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్షకు ఏర్పాట్లు చేయాలన్నారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు.

నేటి నుంచి అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

కర్నూలు కల్చరల్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం వాటికి సంబంధించిన కిట్లను అంగన్వాడీలకు పంపిణీ చేసి మాట్లాడారు. జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శిక్షణకు సంబంధించి జిల్లాకు వచ్చిన 1,882 కిట్లను ఇప్పటికే మండలాలకు సరఫరా చేశామన్నారు

25 నుంచి యాగంటిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

బనగానపల్లె: యాగంటిలో ఈనెల 25 నుంచి మార్చి 1 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ చంద్రుడు సోమవారం తెలిపారు. 25న ధ్వజారోహణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 26న ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాత్రి లింగోద్భవ కాల పూజ, 27న నందికోల, 28 సాయంత్రం రథోత్సవం, మార్చి 1న రుద్రాభిషేకం ఉంటాయన్నారు.

ఉద్యోగ భద్రత .. ఉఫ్!

ఉద్యోగులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉద్యోగ భద్రత లేకుండా ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్సింగ్ (అప్కాస్)ను రద్దు చేయడంపై వ్యతిరేకత వస్తోంది. ఏజెన్సీల పరిధిలోకి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తీసుకురావడంపై నిరసన పెల్లుబుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోవాలనే సందేశంతో రెండు రోజులుగా సోషల్ మీడియాలో పోస్టుల వెల్లువ కనిపిస్తోంది.



చిరుద్యోగుల జీవితాలు చిన్నాభిన్నం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడు నెలల్లో అనేక రూపాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పలు రకాల ఆదాయ వనరులు కల్పించారు. తాజాగా అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై పడింది. గతంలో ప్రతి ఉద్యోగానికి ఒక ధర ఫిక్స్ చేసి మరీ వసూలు చేసిన ఏజెన్సీలను తిరిగి తెరపైకి తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతో పారదర్శకంగా కొనసాగుతున్న ఈ వ్యవస్థపై పాత విధానాన్ని రుద్దేందుకు పూనుకుంటోంది. ఇదే జరిగితే ప్రతి జిల్లాలో వందల మంది చిరుద్యోగుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చు. తక్కువ వేతనంతో ఎక్కువ పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆర్థికంగా చేయూతను అందించాల్సింది పోయి, వారి ఉద్యోగాల్లో వేలు పెట్టడం సరైన చర్య కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కర్నూలు జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు

ప్రభుత్వ కార్యాలయాలు	ఉద్యోగుల సంఖ్య
కర్నూలు నగర పాలక సంస్థ	1,116
ప్రభుత్వ సర్వజన వైద్య శాల	53
గృహ నిర్మాణ సంస్థ	105
రెవెన్యూ	150
డ్వామా	120
డీఆర్‌డీఏ	06
ఇతర ప్రభుత్వ శాఖలు	350

నంద్యాల జిల్లాలో మొత్తం అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య 1300

- 'అప్కాస్' రద్దుపై ఉద్యోగుల్లో వ్యతిరేకత
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలపై ఆందోళన
- సజావుగా సాగుతున్న వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర
- ఏజెన్సీల పరిధిలోకి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తెచ్చేందుకు కసరత్తు
- టీడీపీ కార్యకర్తలకు మేలు చేసేందుకు పన్నాగం
- ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలపై టీడీపీ నేతల ఆరా
- పాత విధానం వద్దంటున్న చిరుద్యోగులు



నంద్యాల మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)

కర్నూలు(అర్బన్)/నంద్యాల(న్యూటౌన్): 'అప్కాస్'ను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. తిరిగి పాత విధానం అమలైతే తమ పరిస్థితి ఏమిటనే ప్రశ్న వారిని తొలచివేస్తోంది. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై టీడీపీ నేతలు ఆరా తీస్తున్నారు. తమ వారికి ఆయా ఉద్యోగాలు కట్టబెట్టేందుకుమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అప్కాస్ పరిధిలో ఉన్న ఉద్యోగులను తొలగించేందుకు వీలు లేని పరిస్థితులు ఉన్న నేపథ్యంలో తమకు అనుకూలమైన ఏజెన్సీల విధానాన్ని తీసుకువచ్చేందుకు కుట్రలు పన్నుతున్నారు.

గతంలో అవినీతి, అక్రమాలు

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేస్తూ వచ్చారు. ఇందులో మితిమీరిన రాజకీయ జోక్యంతో అర్హులకు న్యాయం జరిగేది కాదు. అడ్డగోలుగా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులతో నియామకాలు జరిగేవి. ప్రజాప్రతినిధుల సిఫారసులతో పాటు ప్రతి ఉద్యోగానికి ఒక రేటు ప్రకారం రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆయా ఏజెన్సీలు నిరుద్యోగుల నుంచి భారీగానే డబ్బులు వసూలు చేశారు. అయినా అప్పట్లో ఆయా ఏజెన్సీలు తమ ఖాతాలోకి జమ అయిన వేతనాలను సకాలంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించకపోవడం, ఈపీఎఫ్‌ను సక్రమంగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకపోవడం వల్ల అనేక మంది పలు రకాల ఇబ్బందులకు గురయ్యారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా, విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించిన చిరుద్యోగులను కూడా రాజకీయ జోక్యంతో తొలగించిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా చేశారు..

అనేక ఇబ్బందులు, ఒడిదుడుకుల మధ్య జీవితాలను వెళ్లదీస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'అప్కాస్'ను ఏర్పాటు చేసింది. ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు భిన్నంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీనే వేతనాలను వారి ఖాతాల్లో జమ చేసేందుకు నిర్ణయం తీసుకొని, అమలు చేసింది. అలాగే వేతనానికి ముందే ఈపీఎఫ్ సక్రమంగా జమ చేసే ప్రక్రియకు కూడా శ్రీకారం చుట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం జరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తిరిగి అప్కాస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానంలో ఏజెన్సీలకు పగ్గాలు అప్పగించేందుకు పూనుకోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉద్యోగులు నష్టపోతారు



అప్కాస్‌ను రద్దు చేసి ఏజెన్సీల విధానం అమల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం మంచిది కాదు. దీనివల్ల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోతారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో ఉద్యోగ భద్రత ఉండదు. ఈపీఎఫ్ డబ్బులు గతంలో ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకుండా ఏజెన్సీలు కాజేసిన ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం పునరాలోచించి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు పరిధిలోకి తీసుకురావాలి. నేరుగా ఆయా శాఖాధిపతులతో జీతాలు చెల్లించాలి.

– నాగరాజు, సీఐటీయూ నంద్యాల జిల్లా కార్యదర్శి

ఉద్యోగులకు తీవ్ర నష్టం



అప్కాస్ వ్యవస్థ సజావుగా సాగుతోంది. తిరిగి పాత పద్ధతిపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంది. గతంలో ఏజెన్సీలు ఉన్న సమయంలో వేతనాలను సక్రమంగా అందించేవారు కాదు. పీఎఫ్, ఈఎస్ఐ జమ చేయక కోట్లాది రూపాయలను దిగమింగారు. ప్రతి ఏడాది రెన్యూవల్ కోసం కమీషన్లు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వెళ్తే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతాం.

– ఎండీ అంజిబాబు, సీఐటీయూ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి

అప్కాస్ విధానాన్ని కొనసాగించాలి



అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బాసటగా ఉన్న అప్కాస్‌ను విధానాన్ని కొనసాగించాలి. పాత ద్ధతిలో ఏజెన్సీలను తీసుకురావాలని చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలి. ఏజెన్సీలు వస్తే ఉద్యోగులకు కష్టాలు ప్రారంభమవుతాయి. మొత్తం వ్యవస్థ అంతా అధికార పార్టీ నేతల గుప్పిట్లోకి పోతుంది. వారు చెప్పిందే వేదంగా ఉద్యోగులు పనిచేయాల్సి వస్తుంది. అప్కాస్‌ను రద్దు చేయాలని చూస్తే ఉద్యమాలు చేపడతాం.

– మునెప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

కూటమి ప్రభుత్వంలో నిబంధనలకు తూట్లు

- పీజీఆర్ఎస్‌లో అధికారులకు విన్నవించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు
- గ్రామ, మండల పరిషత్‌ల అనుమతులతోనే ఉపాధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి



జేసీ నవ్యకు వినతిపత్రమిస్తున్న ప్రజాప్రతినిధులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం నిబంధనలకు తూట్లు పొడుస్తోందని, తమను ఉత్సవ విగ్రహాలుగా మార్చి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కార్యకర్తలకే వివిధ అభివృద్ధి పనులు అప్పగిస్తుందని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సత్యనారాయణమ్మతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరైన ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కలిసి ఉపాధి హామీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను గ్రామ, మండల పరిషత్‌లు, పురపాలక సంఘాల అనుమతులతో జరిగేలా చూడాలని కోరారు. కూటమి నాయకుల తీరుపై తాము హైకోర్టును ఆశ్రయించగా నిబంధనలు ప్రకారం చేపట్టాలని ఆదేశాలు ఇచ్చిందని, అయితే, స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు కలగజేసుకోవాలని గూడూరు మునిసిపల్ వైస్ చైర్మన్ అస్లాం కోరారు. లేకపోతే తాము మరోసారి కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

వినతుల్లో మరి కొన్ని...

- ➡ వికలాంగులకు ఉపాధి హామీ పథకంలో 150 రోజులపాటు పనులు కల్పించి 30 శాతం అలవెన్స్ ఇవ్వాలని కల్లూరు మండలం పర్లకు చెందిన 40 మంది దివ్యాంగులు వినతిపత్రం అందించారు.
- ➡ తనకు చెందిన 25 సెంట్ల భూమిని కురువ లక్ష్మన్న కుమారులైన పంపన్న, కేశవ, నాగేంద్ర దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని పెద్దకడబూరు మండలం కంబలదిన్నెకు చెందిన బింగి నరసన్న అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- ➡ 2013వ సంవత్సరంలో కల్లూరు మండలం బి.తాండ్రపాడు, మారుతీ నివాస్ కాలనీలకు నీటి కుళాయిల కోసం రూ. 90వేలు చెల్లించామని, అయితే ఇంతవరకు అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాలకు చెందిన 30 మంది ప్రజలు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి

- 'నేను సైబర్ స్మార్ట్' అవగాహన కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు: అవగాహనతోనే సైబర్ నేరాలను కట్టడి చేయవచ్చని ఏపీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్ అన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్ఎస్ రోడ్డులోని కేవీఆర్ కళాశాలలో విద్యార్థినులకు 'నేను సైబర్ స్మార్ట్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి టీజీ భరత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సైబర్ నేరాల నివారణకు, అవగాహనకు పోస్టర్లు, వీడియోలు ఆవిష్కరించి మాట్లాడారు. ఇటీవల సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల నివారణకు అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఎస్పీ మాట్లాడుతూ... ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కేవీఆర్ కళాశాల ప్రిన్స్‌పాల్ వీవీ సుబ్రహ్మణ్యకుమార్, క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, అడ్మిన్ అడిషన్ ఎస్పీ హుసేన్‌పీరా, కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, పాల్గొన్నారు.

కిడ్నాప్ చేసి ప్రాంసరీ నోటు రాయించుకున్నారు

- జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని పోల్కల్ గ్రామానికి చెందిన సుంకన్న, శాంసన్ మరికొందరు కలసి తనను కిడ్నాప్ చేసి రూ.1.50 లక్షలకు కర్నూలు కొత్త బస్టాండు దగ్గర ప్రాంసరీ నోటు రాయించుకొని వదిలేశారని, ఈ సంఘటనపై విచారణ జరిపి తగు న్యాయం చేయాల్సిందిగా కర్నూలు సోమిశెట్టి నగర్‌కు చెందిన రాజు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు టూటౌన్ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 102 ఫిర్యాదులొచ్చాయని, వీటిపై విచారణ జరిపి చట్టపరిధిలో త్వరితగతిన న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు శ్రీనివాసనాయక్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ➡ వ్యవసాయ శాఖలోని కో-ఆపరేటివ్ సొసైటీలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి వెంకటాపురం గ్రామానికి చెందిన శేఖర్,సుధాకర్ రూ.3.50 లక్షలు తీసుకొని మోసం చేశారని దేవనకొండ మండలం బేతాపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి ఎస్పీ ఎదుట వాపోయాడు
- ➡ హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలుకు చెందిన వీరస్వామి రూ.8 లక్షలు నగదు, 5 తులాల బంగారం తీసుకొని మోసం చేశారని కర్నూలు ఆర్‌కే స్ట్రీట్‌కు చెందిన నాగరాజు ఫిర్యాదు చేశాడు.



రథోత్సవం.. రమణీయం

మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని కోసిగిలో రేణుక ఎల్లమ్మ దేవి మహా రథోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా సాగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి కుడుములు, గుగ్గిళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. – కోసిగి

మల్లన్నా.. ఈ దోపిడీ కనవా!

- ఇష్టారాజ్యంగా అధికరేట్లు వసూలు చేస్తున్న ఓ ప్రైవేట్ సత్రం
- దేవస్థాన వసతి గదుల కంటే అదనంగా డబ్బు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- ఏసీ వసతి గదికి రూ.3 వేలు, నాన్ ఏసీకి రూ.2,500 వసూలు
- దేవదాయశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ సత్రాలు
- చోద్యం చూస్తున్న దేవస్థానం అధికారులు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకుని దేవస్థానంలోని కొన్ని ప్రైవేట్ సత్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తారు. శని, ఆది, సోమవారాల్లో మరి ఎక్కువ సంఖ్యలో తరలివస్తారు. శ్రీశైలానికి వచ్చిన భక్తులు వసతి కోసం శ్రీశైలంలోని ప్రైవేట్ సత్రాలను ఆశ్రయిస్తారు. అయితే, వాటి నిర్వాహకులు దేవస్థాన నిబంధనలకు వ్యతిరేకంగా అద్దెలు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.దీనిని అరికట్టాల్సిన దేవస్థానం అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. శ్రీశైలానికి వచ్చే భక్తుల కోసం పలువురు దాతలు ప్రైవేట్ సత్రాలను నిర్మించారు. కేవలం భక్తులకు భోజనం, వసతి సౌకర్యాల కల్పన కోసం వాటిని నిర్మించారు. శ్రీశైలంలో సుమారు 50కి పైగా సత్రాలు ఉన్నాయి. భక్తులకు వసతి కల్పించేందుకు దేవస్థానంతో పాటు, ప్రైవేట్ వ్యక్తులు దేవస్థానం నుంచి స్థలాన్ని అనుమతి పొంది, సత్రాలు నిర్మించారు. దేవస్థానం ఆధ్వర్యంలో తక్కువ వసతి గదులు ఉండడంతో క్షేత్రానికి వచ్చిన భక్తులు చాలా మంది ప్రైవేట్ సత్రాలను ఆశ్రయిస్తారు.

గది అద్దె రూ.3 వేలు

శ్రీశైలంలోని ఓ ప్రైవేట్ సత్రం నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దేవస్థానంలోని ఒక రోజు ఏసీ వసతి గది అద్దె రూ.3 వేలు, నాన్ ఏసీ వసతి గది రూ.2,500 వసూలు చేస్తున్నారు. అసలు దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో ఏసీ వసతి గది రోజుకు రూ.1,200, నాన్ ఏసీ రూ.800 వసూలు చేస్తున్నారు. అంటే దేవస్థాన వసతి గదుల అద్దె కంటే మూడింతలు పెంచి ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఓ భక్తుడి నుంచి ఈ సత్రం నిర్వాహకులు ఇలాగే ఇష్టానుసారంగా అద్దె వసూలు చేయడంతో భక్తుడికి దిక్కుతోచనిస్థితి ఏర్పడింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎందుకిలా మూడింతలు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే తామింతే..అంటూ భక్తులపై దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం.

పట్టించుకోని దేవస్థాన అధికారులు

శ్రీశైలంలో ప్రైవేట్ సత్రాలు దేవస్థాన నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. సత్రాల నిర్వాహకులు భక్తులకు ఉచితంగా అన్నదానం, వసతి సౌకర్యాన్ని అందించాలి. భక్తులు తాము తోచినంత దానంగా ఇస్తే తీసుకోవాలి. అంతేకానీ గదులు అద్దెల పేరుతో భక్తులను నిలువునా దోపిడీ చేయకూడదు. ఇంతటి నియమాలు ఉన్నప్పటికి, సత్రాలు భక్తుల నుంచి అద్దె వసూలు చేస్తున్నారనేది బహిరంగ రహస్యమే. ఇంత తెలిసినా దేవస్థాన అధికారులు చోద్యం చూస్తున్నారు.

నిబంధనల మేరకు సత్రాలు నిర్వహించాలి



శ్రీశైల దేవస్థానంలో ఓ సత్రం భక్తుల నుంచి వసతి గది అద్దె రూపంలో అధిక డబ్బు వసూలు చేస్తున్నట్లు దేవస్థానం దృష్టికి వచ్చింది. నేను వెంటనే స్పందించి దేవస్థాన రెవెన్యూ అధికారులను పంపించి విచారణ చేయిస్తున్నాను. దేవస్థాన నియమ నిబంధనల మేరకు క్షేత్రంలోని అన్ని సత్రాలు నడుచుకోవాలి. సత్రాల నిర్వహణలపై త్వరలోనే ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోనుంది.

– ఎం.శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

మకర తోరణం, అఖండ దీపం విరాళం



బంగారు మకర తోరణం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానానికి భక్తులు మకర తోరణం, అఖండ దీపం విరాళంగా అందించారు. కృష్ణా జిల్లాకు చెందిన యం.రామచంద్రరావు, కుటుంబ సభ్యులు రూ.24,45,000 ఖర్చు చేసి బంగారు పూతతో తయారు చేయించిన మకరతోరణాన్ని, తెనాలికి చెందిన కొడాలి కృష్ణ చైతన్య రూ.8,46,000 ఖర్చు చేసి 8 కేజీల వెండితో తయారు చేయించిన అఖండ దీపాన్ని సోమవారం ప్రధానార్చకులు కె.శివప్రసాదస్వామి, యం.ఉమా నాగేశ్వరశాస్త్రి, పర్యవేక్షకులు సి.మధుసూదన్‌రెడ్డి, కె.అయ్యన్న, ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరెడ్డికి అందజేశారు. దాతలకు స్వామివార్ల శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

క్లుప్తంగా

పోక్సో కేసుపై విచారణ

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం బి.మల్లేశ్వర్‌పై నమోదైన పోక్సో కేసుపై నంద్యాల ఎస్డీపీఓ జావళి విచారణ చేపట్టారు. బాధిత విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆమె తెలిపారు. కాగా హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సెల్ సభ్యుడు పి.దానం డిమాండ్ చేశారు. ఎస్డీపీఓ వెంట ఎంఈఓ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

ఆలూరు రూరల్: కారు అదుపు తప్పి పొలాల్లో దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. మండలంలోని మొలగవల్లి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మొలగవల్లి గ్రామానికి చెందిన శివరామి రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం కోసిగి గ్రామానికి బయలు దేరారు. మొలగవల్లి రైల్వే స్టేషన్ సమీపంలో కుక్క అడ్డురావడంతో కారు అదుపుతప్పి పొలాల్లో దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శివరామి రెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మీదేవి, సంజీవ రెడ్డి, మహిపాల్ రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య



చలవాది యశోద (ఫైల్)

హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట గ్రామానికి చెందిన చలవాది యశోద (32) అనే వివాహిత ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. ఈమె గత కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతుంది. ఆదివారం నొప్పి మరింత తీవ్రం కావడంతో భరించ లేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ఇనుప గరాండకు చీరతో ఉరి వేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మ్రాం నాయక్ సోమవారం విలేకరులకు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు సంతానం. మృతురాలి తండ్రి తిప్పేస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అగ్నిప్రమాదంలో పొట్టేళ్ల సజీవ దహనం

ఆత్మకూరు: పట్టణంలోని కిషన్‌సింగ్ వీధిలో సోమవారం వేకువజామున జరిగిన అగ్నిప్రమాదంలో పది పొట్టేళ్లు సజీవ దహనమయ్యాయి. ఖాదర్‌వలికి చెందిన రేకుల షెడ్డులో మంటలు గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రేకుల షెడ్డులో ఉన్న పది పొట్టేళ్లు మృతిచెందాయి. సీసీ కెమెరాలు, ఇంటి సామగ్రి సర్వం కాలి బూడిదైంది. ప్రమాదంలో రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. కాగా ప్రమాదం ఎలా జరిగిందనేది తెలియాల్సి ఉంది.

ఆర్ఎంపీపై కేసు నమోదు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని కడమల కాలువ గ్రామంలో ఆర్ఎంపీ సుబ్బరాయుడిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ సోమవారం తెలిపారు. ఆర్ఎంపీ సుబ్బరాయుడు కడమల కాలువ గ్రామంలో ఓ మహిళను కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు సుబ్బరాయుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

శ్రీశైలం: దేవస్థానం టోల్‌గేట్ వద్ద సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రసాద్ రావు తెలిపారు. ఎస్టీ కాలనీకి చెందిన ముదావత్ తిరుపతి నాయక్, మూడవత్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 30 కేరళ మాల్టెడ్ ఫైన్ విస్కీ బాటిళ్లతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో వన్ టౌన్ పోలీసులు రాజేంద్ర కుమార్, రఘునాథుడు, మహేష్, వెంకటనారాయణ, నాను నాయక్ పాల్గొన్నారు.

పదిపై పర్యవేక్షణ కరువు

- వచ్చే నెల 17 నుంచి మొదలు కానున్న పదో తరగతి పరీక్షలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరు డిప్యూటీ డీఈఓ పోస్టులు ఖాళీ
- 17 మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓలు
- 40 ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎం పోస్టులు ఖాళీ
- ఆలస్యంగా మొదలైన ఈ-లెర్నింగ్



ఉల్చాల జెడ్పీ హైస్కూల్

కర్నూలు సిటీ: పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు నామమాత్రమే అన్న విమర్శలు వస్తున్నాయి. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించడంలో డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెచ్ఎంలది కీలక పాత్ర. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్నత పాఠశాలలను పర్యవేక్షణ చేయాల్సిన డిప్యూటీ డీఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఇవీ సమస్యలు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 1,022 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 17 నుంచి మొదలు కానున్న పదవ తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 64,099 మంది హాజరుకానున్నారు. మొత్తం 17 ఎంఈఓ, 4 డిప్యూటీ డీఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటైన ఆత్మకూరు, పత్తికొండ డివిజన్లకు సైతం డిప్యూటీ డీఈఓలు లేరు. అలాగే 40 జెడ్పీ హైస్కూళ్లలో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు లేరు. ఉన్నత పాఠశాలలపై డిప్యూటీ డీఈఓల పర్యవేక్షణ కీలకం. ప్రస్తుతం ఎంఈఓ-1లకు ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఈఓ బాధ్యతలు అప్పగించారు.

- ప్రస్తుతం క్లస్టర్ విధానం, అపార్, టీఐఎస్(టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)లతో రెగ్యులర్ పోస్టుల పనితోనే సమయం సరిపోని పరిస్థితి. ఇన్‌చార్జ్ బాధ్యతలతో ఉన్నత పాఠశాలలను తనిఖీలు చేయలేకపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో రోజుకొక ఫార్మాట్‌లలో సమాచారం ఇవ్వాలని చెప్పడంతో డివిజనల్, మండల అధికారులపై పని భారం పెరిగిపోయింది.
- గతంలో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకునేవారు. విద్యార్థులను చదివించే బాధ్యత వారికి అప్పగించే వారు. పర్యవేక్షణకు మండలాల ప్రత్యేకాధికారులకు సైతం ఉండేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా అగుపించడం లేదు.
- డీఈఓలకు ప్రతి రోజు నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేంత వరకు వీడియో కాన్ఫరెన్స్, వెబెక్స్, టెలీ కాన్ఫరెన్స్‌లతోనే సమయం సరిపోతోంది.
- సబ్జెక్టు నిపుణులు ఉన్నప్పటికీ ఈ-లెర్నింగ్ తరగతులకే పరిమితం అవుతున్నారు.

ఆలస్యంలో 'ప్రత్యేక'ం

పదవ తరగతి పరీక్షలు నెల రోజుల్లో మొదలు కానున్నాయి. గతంలో కంటే ఫలితాలను పెంచాలని లక్ష్యంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా వంద రోజుల ప్రణాళికను తయారు చేయించారు. అన్ని జిల్లాల్లో అదే ప్రణాళికను అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సబ్జెక్టు టీచర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆయా సబ్జెక్టుల్లో 100 శాతం ఫలితాలు సాధించేలా వర్చువల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయించి ఈ-లెర్నింగ్‌కు చర్యలు చేపట్టారు. అయితే ఆ చర్యలు ఆలస్యంగా మొదలయ్యాయి. గతంలో సీ, డీ క్యాటగిరీలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇచ్చే వారు. ప్రస్తుత ప్రభుత్వం పరీక్షల విభాగం తయారు చేసిన మోడల్ ప్రశ్న పత్రాలు, బిట్ బ్యాంకును పీడీఎఫ్ రూపంలో హైస్కూళ్ల హెచ్ఎంలకు పంపించారు. కానీ విద్యార్థులకు ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో ఈ ఏడాది ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నత పాఠశాలలపై పర్యవేక్షణ పెంచితే మంచి ఫలితాలు వస్తాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

> **పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు ఇచ్చాం**
>
> ఉమ్మడి కర్నూలు జిల్లాలో డిప్యూటీ డీఈఓలుగా ఎంఈఓ-1లు ఇన్‌చార్జ్‌లుగా ఉన్నారు. ఉన్నత పాఠశాలలను పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు ఇచ్చాం. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పాం. ఎంఈఓలుగా ఖాళీగా ఉన్న అర్హులైన హెచ్ఎంకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాం. రివిజన్ టెస్టులు నిర్వహించి, ఇందులో వచ్చిన ఫలితాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు మరో సారి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పాం.
>
> – ఎస్.శామ్యూపాల్, డీఈఓ

రేపు ఉమ్మడి జిల్లాల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 19వ తేది ఉదయం 10 గంటలకు నంద్యాల పట్టణంలోని ఆర్‌జీఎం కళాశాల క్రీడా మైదానంలో సీనియర్ మహిళలు, జూనియర్స్ విభాగంలో బాలురకు ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు జరుగనున్నాయి. జూనియర్స్ విభాగం పోటీల్లో పాల్గొనే బాలురు 2005 సంవత్సరం జనవరి 1 వ తేదీ తరువాత జన్మించి ఉండాలని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99402-22232 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు మాల కార్పొరేషన్ చైర్మన్ రాక

కర్నూలు(అర్బన్): రాష్ట్ర మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ ఈ నెల 18న కర్నూలుకు వస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె. తులసీదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐదు జిల్లాల పర్యటనలో భాగంగా 17న రాత్రి కర్నూలుకు వస్తున్నట్లు చెప్పారు. 18న ఉదయం స్థానిక ఎస్సీ కార్పొరేషన్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి తర్వాత అనంతపురానికి వెళ్తారన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ, బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన పరీక్షలకు 47 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ పరీక్షలు 11, బీఈడీ పరీక్షలు 8 కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. డిగ్రీ పరీక్షలకు 365 మందికి 319 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్‌ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బీఈడీ పరీక్షలకు ముగ్గురికి గాను ఇద్దరు హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారని తెలిపారు.

నూర్పిడి యంత్రం బోల్తా.. కూలీ మృతి



వెంకటరమణ (ఫైల్)

పాములపాడు: మినుము పంట నూర్పిడి మిషన్ బోల్తా పడిన ఘటనలో మండల పరిధిలోని ఇస్కాల గ్రామానికి చెందిన మిద్దె వెంకటరమణ(40) మృతి చెందాడు. ఎస్ఐ సురేష్ బాబు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు పుల్లయ్య పొలానికి ఆదివారం తోటి కూలీలతో కలిసి మిద్దె వెంకటరమణ మినుము నూర్పిడి పనులకు వెళ్లాడు. నూర్పిడి యంత్రం పొలంలోకి వెళ్తుండగా పొలం గట్టుపై అదుపు తప్పి మిషన్ బోల్తా పడింది. ప్రమాదంలో యంత్రంపై కూర్చున్న వెంకటరమణ కింద పడి గాయాల పాలయ్యాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య మరియమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు డ్రైవర్ తప్పెట రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

28 నుంచి రోజా దర్గా ఉరుసు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రోజా దర్గా పీఠాధిపతి

కర్నూలు (టౌన్): తుంగభద్ర నది తీరంలో వెలసిన రోజా దర్గా ఉరుసు ఈనెల 28 నుంచి ప్రారంభమవుతుందని ఆ దర్గా పీఠాధిపతి సయ్యద్ దాదా బాషా ఖాద్రీ తెలిపారు. సోమవారం ఆ దర్గాలో ఉరుసుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్ మాసంలో నెలవంక రోజు గంథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ నెల 28 న గంథోత్సవం, మార్చి 1వ తేదీన ఉరుసు, 2 వ తేదీ జియారత్ ఫాతెహాలు ఉంటాయన్నారు. మూడురోజుల పాటు జరిగే ఈ వేడుకలకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా బళ్లారి, మహబూబ్ నగర్, అనంతపురం బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గాలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉరుసు రోజు రాత్రి ఖవ్వాలి ఉంటుందన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో రోజా దర్గా జాన్ నసీన్ ఇషాఖియా సయ్యద్ జావీద్ పాషా ఖాద్రీ, సయ్యద్ నూరుల్లా హుస్సైనీ సాహెబ్, సయ్యద్ మాసుంపీర్ సాహెబ్, సయ్యద్ గౌస్ ఖాద్రీ, ఎస్.కరీమ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల రక్షణకు చట్టాన్ని తీసుకురావాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

- ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జర్నలిస్టులపై దాడులు చేస్తే తక్షణమే అరెస్టు చేసేలా రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, నాయకులు గోరంట్లప్ప, కేబీ శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ నాగేంద్ర కోరారు. పార్వతీమన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి మండల రిపోర్టర్ రామారావుపై దాడి చేసిన టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడును తక్షణమే అరెస్టు చేయాలన్నారు. లేదంటే ధర్నాలు, రాస్తారోకోలకు దిగుతామని హెచ్చరించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జర్నస్టులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.. 'తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే రైలు పట్టాలపై పండుకోబెడతాను' అని బెదిరించినా ఎలాంటి చర్యలు లేవన్నారు. జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ జేసీ డాక్టర్ బి.నవ్యకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సునీల్‌కుమార్, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, నగర ప్రధాన కార్యదర్శి ఎర్రమల పాల్గొన్నారు.

వీఆర్ఏపై టీడీపీ నాయకుల దాడి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన వీఆర్ఏ



దాడికి గురై చికిత్స కోసం వచ్చిన వీఆర్ఏ మాబాషా

అవుకు: కొండమనాయునిపల్లె వీఆర్ఏ ఎమ్. మాబాషాపై సోమవారం టీడీపీ నాయకులు దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమనాయునిపల్లె గ్రామంలో పెద్దల కాలం నుంచి వీఆర్ఏ ఎం. మాబాషాకు సాగు భూమి ఉంది. ఆ భూమిలో మట్టిని తవ్వుకోవాలనే దురుద్దేశ్యంతో కొంతకాలంగా తేదేపా నాయకుడు ఆకుల నాగిరెడ్డి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాబాషా తెలిపారు. గ్రామ సచివాలయ సమీపంలో టీడీపీ నాయకుడు ఉండటంతో ఎందుకు ఇలా చేస్తున్నారని అడగటంతో అతనితో పాటు టీడీపీ కార్యకర్తలు ముకుమ్మడిగా తనపై దాడి చేశారన్నారు. విడిపించటానికి వచ్చిన తన సోదరి అయిన మీరాంబీపై కూడా దాడి చేశారని తెలిపారు. దెబ్బలు అధికంగా తగలటంతో చికిత్స నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చానన్నారు. అవుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, పోలీసులు విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

విజ్ఞాన మేళా.. విద్యార్థులు భళా!



రోబోటిక్ పనిచేసే విధానాన్ని వివరిస్తున్న కళాశాల విద్యార్థులు



విజ్ఞాన మేళా ప్రారంభిస్తున్న మురళీధర్‌రెడ్డి



ప్రొటోటైప్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి అద్భుత ఆవిష్కరణలు ఆవిష్కరించారు. ఇందుకు కర్నూలులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వేదిక అయ్యింది. కళాశాల ఏర్పాటు చేసి 40 సంవత్సరాల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సోమవారం నుంచి శనివారం రూబీ జూబ్లీ సెలబ్రేషన్స్ జరుకుంటున్నారు. అందులో భాగంగా మూడురోజుల పాటు నిర్వహించనున్న విజ్ఞాన మేళా 4.ఓ సోమవారం ప్రారంభమైంది. విజ్ఞాన మేళాను కళాశాల పూర్వ విద్యార్థి, ఏఐఎస్ అధికారి, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి. మురళీధర్ రెడ్డి, కళాశాల చైర్మన్ సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలను వీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. విజ్ఞాన మేళాలో మొత్తం 110 ప్రాజెక్టులు ఏర్పాటు చేశామన్నారు. జీపీఆర్ఈసీ నుంచి 58, జిల్లాలోని 15 పాఠశాలల నుంచి 33, చెన్నై ట్రిపుల్ ఐటీ, కర్నూలు ఐఐటీడీఎం నుంచి ఒకటి, సీఎంఆర్ కళాశాల నుంచి 15 ప్రదర్శనలు వచ్చాయన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మేళాను అందరూ సందర్శించి, విజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. ప్రదర్శనలో సోలార్ పవర్డ్ హైబ్రిడ్ ఈ బైసైకిల్, మిషన్ అన్వేషన్, స్మార్ట్ గ్లాసెస్ ఫర్ బ్లైండ్ పీపుల్, రోబోటిక్ సిస్టమ్ ఫర్ బోర్‌వెల్ రెస్క్యూ ఆపరేషన్, ప్రొటోటైప్ డ్యామ్ ఆకట్టుకున్నాయి.

జిల్లా ట్రెజరీలో ఏజీ ఆడిట్‌కు శ్రీకారం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయం, సబ్ ట్రెజరీల్లో 2023-24 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలపై అకౌంటెంటు జనరల్ (ఏజీ) ఆడిట్‌కు సోమవారం శ్రీకారం చుట్టారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జి.రాజశేఖర్, అసిస్టెంటు అకౌంట్స్ ఆఫీసర్ డి.లక్ష్మణ్ కుమార్, అసిస్టెంట్ సూపర్‌వైజర్ మోహన్‌రావులతో కూడిన బృందం ఈ నెల 17 నుంచి 2 వరకు జిల్లా ట్రెజరీ, కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయాలు, ఈ నెల 22 నుంచి 25 వరకు ఆదోని డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో ఆడిట్ చేపడుతుంది. పెన్షన్ చెల్లింపులు, స్ట్రాంగ్ రూము, చెల్లింపులు, జమలు తదితర వాటిని ఏజీ టీమ్ ఆడిట్ చేసుందని జిల్లా ట్రెజరీ అధికారులు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో రాయలసీమకు అన్యాయం



మాట్లాడుతున్న రామకృష్ణ

కర్నూలు (సెంట్రల్): కూటమి ప్రభుత్వంలో రాయలసీమ, ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సోమవారం కర్నూలులోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిధులన్నీ అమరావతి, పోలవరంలకే కేటాయించి సీమ, ఉత్తరాంధ్రకు సీఎం చంద్రబాబు ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రాంతాల్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి వచ్చే బడ్జెట్‌లోరూ.30 వేలకోట్లను కేటాయించాలన్నారు. కృష్ణానది బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నాయకులు రామాంజనేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.

యూట్యూబ్ చానల్ విలేకరి అదృశ్యం



తిరుమలరెడ్డి (ఫైల్)

మద్దికెర: ఇంటి నుంచి పొలానికి ద్విచక్రవాహనంపై బయల్దేరిన యూట్యూబ్ చానల్ విలేకరి, మద్దికెర గ్రామానికి చెందిన బోగోలు తిరుమలరెడ్డి (45) బుగ్గ సంగాల వద్ద అదృశ్యమయ్యాడు. ఘటనా స్థలంలో మొబైల్, చెప్పులు పడి ఉన్నాయి. బైక్‌పై బండరాళ్లతో దాడి చేసిన ఆనవాళ్లున్నాయి. ఎవరో పథకం ప్రకారం దాడిచేసి.. కిడ్నాప్ చేశారా.. లేక హత్య చేసి కాలువలో పడేశారా అనేది తెలియడం లేదు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. గ్రామానికి చెందిన బోగోలు వెంకటరెడ్డి, సౌభాగ్యలక్ష్మి కుమారుడైన బోగోలు తిరుమల రెడ్డి గుంతకల్లులో నివాసం ఉంటూ బీవీఆర్ టుడే న్యూస్ అనే యూట్యూబ్ చానల్‌కు విలేకరిగా ఉంటూనే బుగ్గ సమీపంలోని తన తోటలో వ్యవసాయ పనులు చేసేవాడు. రోజు మాదిరిగానే సోమవారం తోటకు వెళ్లాడు. కాలువ వెంబడి తోటకు వెళ్లే రస్తాలో పడి వున్న బైకును చూసి రైతులు పోలీసులకు సమాచారం అందించడంతో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విచారణ చేపట్టారు. భార్య కావ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు – ఆర్టీసీ బస్సు ఢీ

శ్రీశైలం: శ్రీశైలం సమీపంలోని రామయ్య టర్నింగ్ వద్ద కారు – తెలంగాణ ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన ప్రతీక్ మిశ్రా, రష్మీ మిశ్రా దంపతులు కారులో శ్రీశైలం బయలుదేరారు. రామయ్య టర్నింగ్ వద్ద ఎదురుగా వస్తున్న తెలంగాణ ఆర్టీసీ బస్సు – కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రతీక్ మిశ్రా, డ్రైవర్ వాసులకు స్వల్ప గాయాలు కాగా స్థానికులు ప్రథమ చికిత్స చేయించారు. రష్మీ మిశ్రా షాక్‌కు గురి కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలించారు.

20 గడ్డివాముల దగ్ధం

మద్దికెర: మద్దికెర గ్రామ శివారులోని కొత్తపల్లి రహదారిలో ఉన్న స్వామి, చిన్న రంగస్వామి, ఈరన్న, రాముడు, హనుమంతు, ప్రసాద్, మాణిక్యం, నాగప్ప, మల్లికార్జున అనే రైతులకు చెందిన 20 గడ్డివాములు సోమవారం తెల్లవారుజామున కాలిబూడిదయ్యాయి. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఈ వాములకు నిప్పు పెట్టడంతో తమకు దాదాపు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు.

'దేవ' చిత్రం.. అపు'రూపం'



దూపం దేవదాసు చేతి నుంచి వెలువడిన అపురూప చిత్రాలు

- చిత్ర లేఖనంలో రాణిస్తున్న పత్తికొండ విద్యార్థి
- జాతీయ స్థాయిలో పతకాలు, ప్రశంసాపత్రాలు



జ్ఞాపికలతో దూపం దేవదాసు

కర్నూలు(అగ్రికల్చర్): దేవుళ్ల చిత్రాలను రూపొందించడం.. జాతీయ నాయకుల రూపాన్ని తన చిత్రాల్లో చూపించడం.. ప్రకృతి రమణీయతను అపురూపంగా చిత్రీకరించడం... పత్తికొండ పట్టణానికి చెందిన దూపం దేవదాసు ప్రత్యేకత. చిత్రలేఖనంపై ఎనిమిదో తరగతి నుంచే మక్కువ పెంచుకొని డిగ్రీలో కూడా లలిత కళలకు సంబంధించిన కోర్సును అభ్యసిస్తున్నాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు, బహుమతులు పొందుతూ... అందరి చేత ప్రశంసలు అందుకుంటున్నాడు. ప్రస్తుతం కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో బీఎఫ్ఏ(బ్యాచలర్ ఆఫ్ ఫైన్స్ ఆర్ట్స్) మూడో సంవత్సరం చదువుతున్నాడు. ప్రఖ్యాత చిత్రకారుడిగా గుర్తింపు పొందాలనేది తన లక్ష్యమని విద్యార్థి దూపం దేవదాసు తెలిపారు. బీఎఫ్ఏ పూర్తయిన తర్వాత పీజీలో ఇందుకు సంబంధించిన కోర్సునే తీసుకొని మరింత నైపుణ్యాలను పెంచుకుంటానని చెప్పారు.

ఇదీ ప్రత్యేకత..

- ఎడమ చేతితో రాయడం, చిత్రాలు గీయడం దేవదాసు ప్రత్యేకత.
- కళ్ల ముందే నిమిషాల వ్యవధిలో చిత్రాన్ని గీస్తాడు.
- యోగి వేమన యూనివర్సిటీలో బీఎఫ్ఏ రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో జాతీయ స్థాయి ఇంటర్ యూనివర్సిటీల యూత్ ఫెస్టివల్‌లో ఈ యువకుడికి రజత పతకం లభించింది.
- భారతదేశంలో ప్రముఖ వేడుకను తన చిత్రంలో ఆవిష్కరించినందుకు జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ లభించింది.
- తిరుపతి విజ్ఞాన కేంద్రం, తిరుపతి శ్రీ కళాక్షేత్ర సంయుక్తంగా నిర్వహించిన వేమన పద్య భావన చిత్ర కళా పోటీల్లో మూడో కేటగిరిలో మొదటి బహుమతి అందుకున్నారు.
- జిల్లా స్థాయిలో ఒకసారి మొదటి, మరోసారి రెండో బహుమతి అందుకున్నారు.